www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 12 ఫిబ్రవరి 2023

5

కాకినాడ



వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బాబ్జి

ప్రజాశక్తి -కరప

ఎపి ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి ప్రముఖ వైద్యులు కోరుకొండ బాబ్జిని విసిగా నియమించిన సంధర్భంగా వేళంగి సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్ అభినందనలు తెలియజేశారు. శనివారం ఒక ప్రకటనలో కాజులూరు జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాకా చంద్రరావు. సాంబత్తుల వెంకట్రావు , పొలుగుమాటి నరసింహమూర్తి, గుడాల కృష్ణ, గిడ్ల వీర ప్రసాద్, పివి రావు మాలమహనాడు కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు మాత అప్పారావు తదితరులు ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేశారు.


డాక్టర్ బాబ్జి

ప్రతిరోజూ ఆగ్రహమేనా..

- గత ఏడాది 50 మందికి పైగా షోకాజ్ - నలుగురికి పైగా సస్పెన్షన్

- 900 మంది చేయాల్సిన పనికి 700 మంది - స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చోటు దక్కించుకుంటుందా

- ప్రత్యామ్నాయ మార్గాలు లేవి? - ఒత్తిడితో నగర పారిశుధ్య నిర్వహణ


డ్రైనేజీలు అద్వానం గా ఉండటంతో వర్షపు నీటిలో మునిగిన రామకృష్ణారావు పేట(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగర పాలకసంస్థ పరిధిలో ప్రతీ రోజూ పారిశుధ్యం పై కమిషనర్ రమేష్, అదనపు కమిషనర్ నాగ నరసింహారావు, ఎంహెచ్ఓ పధ్వి చరణ్ మూడు విభాగాలుగా ప్రతిరోజు పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతిరోజు సిబ్బందిపై ఆగ్రహం, సోకజ్ నోటీసులు, అవసరమైతే సస్పెండ్ చేయడం, లేని పక్షంలో ఇతర సర్కిల్‌కు మార్పులు చేస్తున్నారు అయితే ఇక్కడ నిర్లక్ష్యం ఎవరిది? ప్రతిరోజు పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందిని సాకుగా చూపించడమేనా? అధికారులు సిబ్బంది మధ్య సమన్వయ లోపమా? నగరంలో పారిశుధ్య ఇబ్బందులు తలెత్తడానికి గల కారణాలు ఏంటి?

నగరాన్ని 14 సర్కిళ్లుగా విభజించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, నియమించడంతో పాటుగా 900 మంది నగరంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గత కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండకర్ నగరాన్ని పూర్తిస్థాయిలో క్లీన్‌సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. ఇందులో భాగంగా జాతీయస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణలో కూడా కాకినాడ నగరం రెండుసార్లు పదవ ర్యాంకులో చోటు తగ్గించుకుంది. జిల్లాల విభజనలో కమిషనర్ దినకర్ విజయవాడ బదిలీపై వెళ్లగా, అదనపు కమిషనర్ నాగ నరసింహారావు బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఆయన వెళ్లిన తర్వాత పారిశుధ్యంపై అధికారులు పూర్తిగా పట్టు కోల్పోయారని చెప్పాలి. కొత్తగా వచ్చిన కమిషనర్ రమేష్ కూడా పారిశుధ్య విషయంలో కఠినంగా వ్యవహరించినా మార్పులు తీసుకు రాలేకపోతున్నారు.. ప్రతిరోజు మూడు విభాగాలుగా పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తూ ఎప్పటి కప్పుడు సిబ్బందికి, ప్రజలకు సూచనలు ఇచ్చినప్పటికీ మెరుగుపరడం లేదు.

సిబ్బంది కొరత

- 900 మంది చేయాల్సిన పనికి 700 మంది

గతంలో పారిశుధ్యాన్ని 14 సర్కిల్లోనూ మొత్తంగా 900 మంది సిబ్బంది పని చేస్తూ ఎక్కడా ఇబ్బందులు లేకుండా పనులు చేస్తూ ఉండేవారు. కానీ ఇప్పుడు 700 మందే పని చేస్తుండటం వల్ల ఈ ఇబ్బందులు తలెత్తుతున్నా యని నగరపాలక అధికారులు అంటున్నారు. 200 మంది సిబ్బందిని తడి పొడి చెత్త వాహనాలతో పంపించడం వల్ల క్షేత్రస్థాయిలో పారిశుధ్య సిబ్బందిపై పని ఒత్తిడి పడు తోందని, డ్రెయినేజీలను, చెత్తను శుభ్రం చేయడం కాస్త ఇబ్బంది అవుతోందని అధికారులు అంటున్నారు. గత ఏడాది 50 మందికి పైగా షోకాజ్ నోటీసులు ఇచ్చి సంజాయిషీ అడగడంతో పాటుగా, నలుగురికి పైగా సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనే కాకినాడప ర్యాంకు సాధిస్తుందో చెప్పలేని పరిస్థితి.

తడి-పొడి చెత్త సేకరణతోనే ఇబ్బందులు

-ప్రయివేట్ సంస్థ కాంట్రాక్ట్ ఒప్పందంతోనే సిబ్బంది కొరత

ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరుచేసి ఇచ్చేలా తీసుకొచ్చిన ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం వల్లే నగరంలో పారిశుధ్య అద్వానంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పినప్పుడు దాని పూర్తి బాధ్యత ప్రైవేట్ సంస్థ వహించాలి. ఈ ప్రైవేట్ సంస్థ కేవలం వాహనాలను తిప్పడం వరకే ఒప్పందం చేసుకోవడంతో నగరపాలక సంస్థ నుంచి 200 మంది పారిశుధ్య సిబ్బందిని ఈ ప్రైవేట్ సంస్థకు ఇస్తూ వారితో పనిచేస్తున్నారు. కానీ నగరపాలక సంస్థ నుంచి ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా ప్రతి నెల రూ.36 లక్షలు పైగా ఇస్తున్నారు. ప్రైవేట్ సంస్థ అగ్రిమెంట్ చేసుకున్నప్పుడు నగరపాలక సంస్థ ఈ విధంగా చేసుకోవడంతో ఇప్పుడు అందరు తలలు పట్టుకుంటున్నారు. కొత్త వారిని తీసుకోవడానికి వీలు లేకపోవడంతో, ఇప్పుడు ఉన్నవారితోనే పనులు నెట్టుకు రావలసిన పరిస్థితుల్లో అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం లేచి క్షేత్రస్థాయిలో ఉన్నవారితో పని చేయించుకుంటూ, వారిపైన ఆగ్రహం వ్యక్తం చేస్తూ పారిశుధ్య నిర్వహణను నెట్టుకొస్తున్నారు.


ఇటీవల కాకినాడలో సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు ఆందోళన (ఫైల్ ఫోటో)

ముఖ హాజరు మాకొద్దు

- పని భారంతో అంగన్‌వాడీలు
- అరకొర వేతనాలతో నిత్యం సతమతం
- సమస్యలు పరిష్కరించని సర్కార్
- అంగన్‌వాడీలకు అమలుకు అధికారుల కసరత్తులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా, వారితో సమానంగా పనిచేస్తున్నా సమానమైన వేతనాలు ఇవ్వకుండా వారితో బాటు అమలు చేస్తామంటున్న ముఖ హాజరును అంగన్‌వాడీ వర్కర్లంతా తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్న తమను ముఖ హాజరు పేరుతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మండిపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 5,546 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 3,23,575 మంది పిల్లలు న్నారు. సుమారు 5 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 4,818 ఆయాలు పని చేస్తున్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించ డంతో పాటు వారు ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు యాప్‌ల ద్వారా ప్రభుత్వానికి చేరవేస్తున్నారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లో రోజువారీ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆరోగ్య సర్వేలో పాలుపంచు కుంటు న్నారు. ఉదయం 9 గంటలకు మొదలుకొని సాయంత్రం 5 గంటల వరకు అంగన్‌వాడీ సేవలతో పాటు ప్రభుత్వం అప్పగించిన వివిధ విధుల్లో పాల్గొంటున్నారు.

ఫేస్ హాజరు అవసరమా..?

ఇప్పటికే భారాలు అనేకం ఎక్కువైన నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అంగన్‌వాడీలకు ముఖ హాజరును అమల్లోకి తీసుకొస్తామని సర్కారు చెప్పడం, ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు కసరత్తులు ప్రారంభించడం వంటి అంశాల నేపథ్యంలో అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ముఖ హాజరు మాకు అవసరం లేదంటూ తేల్చి చెబుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గ్రామ స్థాయిలోనే ఉంటున్న తమపై మరో భారం మోపడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫేస్ యాప్ ద్వారా ఒకవేళ సిగ్నల్ పని చేయక నమోదు కాకపోతే ఆ రోజు వేతనం కట్ చేస్తారు. సాంకేతిక కారణాలను పక్కనపెట్టి అధికారుల వేధింపులు మరింత ఎక్కువవుతాయని వారు ఆరోపిస్తున్నారు. రెండుపూటలా గొడ్డు చాకిరీ చేస్తుంటే వర్కర్లకు రూ.11,500, మినీ వర్కర్లు, హెల్పర్లకు రూ.7,500 మాత్రమే వేతనం ఇస్తున్నాం న్నారు. గత ఎనిమిదేళ్లగా కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదు. అరకొర వేతనాలతో పెరుగుతున్న నిత్యవసరాలు, గ్యాస్ ధరలు, పన్నుల భారంతో కుటుంబాల పోషణ కష్టంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనంగా ఇప్పు డున్న ధరలను దృష్టిలో ఉంచుకుని నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో వేలాదిమంది అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున ఆందోళన జరిపారు. ముఖ హాజరు అమలు చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలను పరిష్కరించాలి

ఇప్పటికే పని భారం పెరిగింది. ఆన్ లైన్ యాప్ ల ద్వారా అనేక వివరాలను నమోదు చేయాల్సి వస్తుంది. దీని నేపథ్యంలో అంగన్వాడీల సమస్యల న్నింటినీ పరిష్కరించి ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ, అభివృద్ధికి కషి చేయాల్సిన అవసరం ఉంది.

వి.ఎస్తేరు రాణి, ఉండూరు, సామర్లకోట రూరల్




ఎడిసన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కుమార్, విద్యార్థులు

ఆదిత్యలో ఎడిసన్ జయంతి

ప్రజాశక్తి - గండేపల్లి

థామస్ అల్వా ఎడిసన్ జయంతి సందర్భంగా సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.టి.వి.ఎస్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో థామస్ ఆల్వా ఎడిసన్ జయంతి కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ థామస్ అల్వా ఎడిసన్ మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప అమెరికన్ శాస్త్రవేత్త, వ్యాపారవేత్త. అని తెలిపారు. కార్యక్రమంలో డీన్. ఎ.వి. మాధవరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రహణం మొర్రి లోపాలాపై 15న వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

కాకినాడ శాంతి నగర్‌లోని శ్రీ రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో గ్రహణంమొర్రి బలహీనతలు గల వారికోసం ఈ నెల 15వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంఇఒ వై శివరామ కృష్ణయ్య శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రహణం మొర్రి, గ్రహణ శూల (పెదవి చీలిక, అంగిళి చీలిక) లోపాలు కల్గిన 6 నెలల నుండి 50 ఏళ్ల వయస్సు వరకు గల అందరికి ఉచిత స్క్రీనింగ్ పరిక్ష నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహి స్తారన్నారు. గతంలో గ్రహణ మొర్రి, గ్రహణ శూల ఆపరేషన్ జరిగిన వారు కూడా హాజరు కావచ్చునన్నారు. అవసరం ఉన్న ప్రజలంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శివరామకృష్ణయ్య తెలిపారు.

సాగునీరివ్వలేని అసమర్ధ ప్రభుత్వం


పంట పొలాలను పరిశీలిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రజాశక్తి - కాజులూరు

వైసిపి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని రామచంద్రపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న వరి పొలాలను ఆయన శనివారం పరిశీలించారు.15 రోజులుగా కాలువల ద్వారా నీరు రాకపోవడంతో చేలు ఎండిపోతున్నాయన్నారు. విద్యుత్ మోటార్లను వినియోగించి నీరు తోడుకుందామంటే కరెంటు ట్రాన్స్ఫర్ కూడా కాలిపోయి 20 రోజులు అయినా పట్టించుకునే అధికారులు లేరు అని వాపోయారు. దీంతో రైతులు డీజిల్ ఇంజన్లతో సొంత ఖర్చులు పెట్టుకుని చేలకు నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం దారుణ మన్నారు. దాళ్వా పంటకు నీరు అందించలేమని ముందే ఇరిగేషన్ అధికారులు చెప్పి ఉంటే రైతులు పంటలు వేసేవారు కాదని వాపోయారు. ముఖ్యంగా కౌలు రైతులు కౌలు ఎలా చెల్లించాలి పెట్టిన పంటకి ఎకరానికి 20 వేలు పెట్టుబడి పెట్టి పెట్టుబడిని ఎలా రాబట్టాలి అని వాపోతున్నారు ,రైతులకు ఏర్పడిన నష్టాన్ని ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు గరగా సత్తిరాజు, చాగంటి వెంకటరమణ, చాగంటి వెంకట చంద్ర రావు, కంచుమర్తి సత్యనారాయణ, పైడికొండల చిన్న, పైడికొండల చిరంజీవి, చిగ్గిన సూర్య నారాయణ, ఆడపా కృష్ణమూర్తి, అడపా ఆదినారాయణ, తెలుగుదేశం నాయకులు రాయుడు లీలాశంకర్, పేంకాయల బాబ్జి, వనుము వీరబ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

శివారు భూములకు పంట నీరు అందించి రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి టేకు మోడీ ఈశ్వరరావు మాట్లాడారు. తాళ్లరేవు మండలం వివిధ గ్రామాల్లోని కాలువ శివారు భూములకు పంట నీరునందించి పంటలను కాపాడాలని కోరారు. మండలంలో గ్రాంటు, పత్తిగొంది, చొల్లంగి, కోరంగి, జీ.వేమవరం తదితర గ్రామాల్లో సాగునీరు అందక వరి పొలాలు బీటలు వారుతున్నాయన్నారు. రైతులు ఆందోళన మేరకు అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిన, సమస్య పరిష్కారం కాలేదని ఇది మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత యంత్రాంగం స్పందించి పంట కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఉపాధి హామీ పథకము ద్వారా క్లీన్ చేయించాలన్నారు. ఇరిగేషన్, రెవిన్యూ, డ్రైనేజీ అధికారులు సమన్వ యంతో కమిటీలను ఏర్పాటు చేసి రైతులకు వంతులు వారి నీటిని అందించాలని ఈశ్వరరావు డిమాండ్ చేశారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,182 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో 1182 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు తెలిపారు. వీటిలో సివిల్ కేసులు 8, క్రిమినల్ కేసులు 45, మోటారు వాహనాల ప్రమాద కేసులు 7, లిటికేషన్ బ్యాంకు కేసులు 17, క్రిమినల్ చలానా కేసులు 1105 ఉన్నాయన్నారు. ఈ లోక్ అదాలత్‌ల నిర్వహణకు మూడు బెంచ్ లు ఏర్పాటు చేశారన్నారు. మొదటి బెంచ్‌కు 7వ అదనపు జిల్లా జడ్జి నిఖత ఆర్ వార అధ్యక్షులుగా, న్యాయవాది ఆర్ కామేశ్వర రావు మెంబర్‌గా, 2 వ బెంచ్ కు సీనియర్ సివిల్ జడ్జి వై బెన్నయ్య నాయుడు అధ్యక్షులుగా, న్యాయవాది ఆర్.వి విజయలక్ష్మి మెంబర్‌గా, 3వ బెంచ్‌కు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన్ అధ్యక్షులుగా, న్యాయవాది ఎం.రాంబాబు మెంబర్‌గా వ్యవహరించారన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



కుట్టు మిషన్లు అందజేస్తున్న మంత్రి కారుమూరి, ఉమర్ అలీషా

కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మానజీవితంలో అత్యంత విలువైనది కాలం అని దానిని ఎల్లప్పుడూ సద్వినియోగం చేసుకోవాలని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం 95వ వార్షిక జ్ఞాన మహాసభలు ముగింపు సందర్భంగా శనివారం నూతన ఆశ్రమం వద్ద జరిగిన సభలో ఆలీషా ప్రసంగిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా పీఠం చేపట్టిన 'నా మొక్క - నా శ్వాస' కార్యక్రమంలో ప్రతి సభ్యుడూ పాల్గొని తమ వంతుగా ఒక్కో మొక్కను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పిఠాపురం మాజీ ఎంఎల్ఎలు ఎస్‌విఎస్ఎన్ వర్మ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన కుట్టు మిషన్లు, పక్షుల ఆహారం కొరకు తయారుచేసిన ధాన్యపు కుచ్చులు, అంధ విద్యార్థులకు ఎన్.ఆర్.ఐ. సభ్యులు పేరూరి ఉమా అరవింద్, విజయరామ సుబ్బారావు, సన ఏర్పాటు చేసిన నూతన వస్త్రాలను పీఠాధిపతి సమక్షంలో మంత్రి అందజేశారు. పీఠాన్ని దర్శించుకున్న వారిలో కాకినాడ జడ్పీ వైస్ చైర్మన్ బుర్ర అనుబాబు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ ఛైర్మెన్ బొంగరాల రవిచంద్రన్, వజ్రకూటం సర్పంచ్ గుర్రాజు, సిరిపురం సర్పంచ్ రామలింగేశ్వరరావు, మునిసిపల్ కౌన్సిలర్స్ కోళ్ల బంగారు బాబు, రాయుడు శ్రీనుబాబు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్చార్జి మాకినీడి శేషు కుమారి ఉన్నారు. సభలో నిర్వహించిన సంగీత విభావరిలో ఎ.ఉమ, అంధ విద్యార్థులు ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ పాల్గొన్నారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపడుతున్న తిరుపాణ్యం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిరుపాణ్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.వి. తిరుపాణ్యం శనివారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తిరుపాణ్యాన్ని విశాఖపట్నం జిల్లా చోడవరం కళాశాలకు బదిలీ చేస్తూ అక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపల్ రామచంద్రరావును కాకినాడకు బదిలీ చేస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రిన్సిపల్ తిరుపాణ్యం ఏ విధమైన తప్పు చేయకుండా బదిలీ చేయడం ఏంటని కోర్టును ఆశ్రయించారు. దీంతో తిరిగి కాకినాడ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ గా నియమిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు అనుసరిస్తూ విద్యాశాఖ కమిషనర్ తిరిగి యధావిధిగా ఆయన్ను కాకినాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా నియమిస్తూ ఉత్తరాలు జారీ చేశారు. దీంతో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కార్టూ'నిజం'



అమర గాయకుడు ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అమర గాయకుడు ఘంటసాల వర్ధంతిని ప్రజాసంఘాల భవనంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్, ఏఎన్నార్, ఘంటసాల, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షులు ఉంగరాల వెంకటేశ్వరరావు (బూరిబాబు) ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూల మాలవేసి పలువురు నివాళులర్పించారు. ఘంటసాల ఆలపించిన గీతాలను సలాది సత్తిబాబు, చిన్ని, అందరికీ వినిపించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, గాజుల సుబ్రహ్మణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి స్మారక కళావేదిక ఆధ్వర్యంలో

కాకినాడకార్పొరేషన్ కాకినాడలో ఘంటసాల విగ్రహం వద్ద స్థానిక అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు కర్రి అచ్యుతారెడ్డి, కార్యదర్శి పంపన దయానంద బాబు, ఎన్ఎస్ఎస్ కంపెనీ అధినేత నారాయణం మురళి ఘంటసాల విగ్రహం వద్ద నివాళర్పించారు. అనంతరం ఘంటసాల ను స్మరించుకుంటూ కాకినాడ సినీ సంగీత కళాకారులు ఆయన పాటలు పాడారు.

కాకినాడరూరల్ తన గాన మాధుర్యంతో యావత్రపంచాన్ని ఉర్రూతలూ గించిన గాన గంధర్వుడు ఘంటసాల అని విశ్రాంత తహశీల్దార్ రేలంగి బాపిరాజు అన్నారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, సత్యనారాయణ వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.


ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు


కాకినాడలో ఘంటసాల విగ్రహం వద్ద అల్లూరి స్మారక కళావేదిక సభ్యుల నివాళి


బోట్ క్లబ్‌లో ఘంటలసాల చిత్రంపటం వద్ద వాకర్స సభ్యుల నివాళి

నేరాలు ఘోరాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి మాధవరెడ్డి

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

అమలాపురం పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి వివరాలను వెల్లడించారు. అమలాపురం డిఎస్‌పి వై.మాధవరెడ్డి పర్యవేక్షణలో అమలాపురం సిసిఎస్ సిఐ గోవిందరాజులు, అమలాపురం రూరల్ సిఐ పి.వీరబాబు, తాలూకా ఎస్ఐ ఎ.వరదేశ్, సిబ్బంది కలిసి తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో బట్నవిల్లి గ్రామానికి చెందిన కన్నెపాముల శివశంకర్ నాగ దుర్గాప్రసాద్, ఇళ్ళ సతీష్, కన్నెపాముల నాగప్రసాద్ లు అమలాపురం మండలం కామనగరువు గ్రామం మేధా గార్డెన్స్ ఇంటి దొంగతనం చేసిన కేసును పోలీసులు ఛేదించారన్నారు. నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్నారని అన్నారు. వారి వద్ద నుంచి రూ. 3 లక్షల 49 వేలు విలువచేసే వస్తువులను రూ.లక్షా 48 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ కేసును ఛేదించిన అమలాపురం సిసిఎస్ పోలీస్, అమలాపురం రూరల్ సిఐ, అమలాపురం తాలూకా ఎస్ఐ, సిబ్బంది, క్లూస్ టీమ్‌ను జిల్లా ఎస్‌పి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యాచకురాలు మృతి

ప్రజాశక్తి -రాజానగరం

రోడ్డు ప్రమాదంలో యాచకురాలు మృతి చెందింది. దివాన్ చెరువు జాతీయ రహదారి గైట్ కళాశాల దగ్గర సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉన్న యాచకురాలిని కంటైనర్ లారీ ఢీ కొంది. దీనితో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. మతురాల పూర్తి వివరాలు తెలియాలని సమాచారం తెలిసిన వారు సెల్ నెంబర్ 9440796533, 9866063391 కాల్ చేయాలన్నారు. దీనిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గోకవరం

అశోక్ లైలాండ్ వ్యాను బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గోకవరంలో చోటుచేసుకుంది గోకవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. గంగవరం మండలం జియం పాలెం గ్రామానికి చెందిన కారం తమన్న దొర తన ఇంటి నుంచి బైక్ తో బయలుదేరి గోకవరం మీదుగా లోతుపాలెం వెళుతున్నాడు. ఈ సమయంలో గోకవరం ఇంద్రమ్మ కాలనీ వద్ద దేవీపట్నం మండలం ఫజుల్లా బాద్ నుంచి గోకవరం మీదుగా వస్తున్న దుంపలలోడు అశోక్ లేలాండ్ ఫ్యాన్ డ్రైవర్ అతివేగంతో బైక్ ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తమన్న దొర అక్కడికక్కడే మతి చెందాడు అన్నారు. మృతుని తల్లి కారం లక్ష్మమ్మ గోకవరం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ నాగబాబు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు తెలిపారు

పంట కాలువలో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం ఇంజరం పంచాయతీ సిద్ధార్థ నగర్ చర్చి ఎదురుగా పంట కాలువలో మతదేహం లభ్యమైనట్లు కోరంగి ఎస్.ఐ. పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఇంజరం విఆర్ఒ ఇచ్చిన సమాచారం మేరకు విచారణ చేపట్టగా చని పోయిన వ్యక్తి కాజులూరు మండలం సీళ్ళంక గ్రామానికి చెందిన జగడం లోవరాజు (30)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

టౌన్ హాల్లో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసే అరెస్టు చేసినట్టు జగ్గంపేట ఎస్ఐ విద్య సాగర్ తెలిపారు. శనివారం జగ్గంపేట గోకవరం రహదారిలో ఉన్న టౌన్ హాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.17,200 సొమ్మును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి మంగళవారం ఉదయం పెద్దాపురం కోర్టుకు హాజరుపరచనున్నట్టు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

పిఠాపురం రోడ్డు పెద్ద ఏలేరు కాలువ వద్ద ఉప్పు వారి సత్రం వద్ద మామిడి తోటలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో సామర్లకోట సీఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.33,450 స్వాధీనం చేసుకున్నట్లు సామర్లకోట సిఐ దుర్గాప్రసాద్ తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తపాడులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బావిలో పడ్డాడు. ఈ సంఘటన పై పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి.. మిర్తిపాడు గ్రామంలో మద్దిపాటి స్వర్ణ కుమారి స్థలంలో గడ్డి మేటు దాని చుట్టూ ప్రహరి ఉంది. లోపల గోడ పక్కనే బావిలో వ్యక్తి పడ్డాడని స్థానికుల సమాచారం మేరకు విఆర్ఒ నామాల రత్నకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సీతానగరం ఎస్ఐ శుభ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాలిక అదృశ్యంపై..

ప్రజాశక్తి-గోపాలపురం

బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు పై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గోదారి గలగలలు

పరిశ్రమల్లో రక్షణ చర్యలేవీ..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పారిశ్రామిక చట్టాలకు తూట్లు పొడిచేలా పరిశ్రమలు ఏర్పాటు, నిర్వహణ జరుగుతోందని మరోసారి సుస్పష్టమైంది. పెద్దాపురం మండలం జి.రాగంపేటలో అంబటి ఆయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంతో జిల్లా ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి 30 రోజులకోసారి ఎక్కడో ఒక చోట ఇటువంటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదం జరిగిన అనంతరం ప్రభుత్వం కంటితుడుపుగా పరిహారం ప్రకటించడం చేతులు దులుపుకోవటం పరిపాటిగా మారింది. రెండునెలల క్రితం తాడేపల్లిగూడెం కడియద్ద వద్ద జరిగిన బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు కారణంగా జిల్లాకు చెందిన పలువురు కార్మికులు మృతి చెందిన విషయం విదితమే. అనంతరం దేవరపల్లిలోనూ ఒక ఫ్యాక్టరీలో ప్రమాదం చోటు చేసుకుని కార్మికులు మృత్యువాత పడ్డారు. గతంలో బైకే పరిశ్రమలోనూ ఇటువంటి ప్రమాదమే చోటు చేసుకుంది. ఫ్యార్ షుగర్స్‌లో కేవలం 10 రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు జరిగాయి. ఫ్యాక్టరీల నిర్వాహకులు కార్మికులకు కనీస రక్షణ పరికరాలు అందించకపోవటం, పని ప్రదేశాలలో జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం యథేచ్ఛగా అనుమతులు మంజూరు చేయటం, పరిశ్రమల ఏర్పాటు అనంతరం కనీస పర్యవేక్షణ లేకపోవటమే ఈ దుస్థితికి కారణమని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రమాద నివేదికను వెల్లడించటంతో పాటు భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజలు ప్రభుత్వ యంత్రాంగాన్ని డిమాండ్ చేస్తున్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కదం తొక్కారు. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన గతంలో అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించుకోవటంతో పాటు హక్కులను సాధించుకున్న విషయం విదితమే. అదే స్ఫూర్తితో ఆ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపుతో ముందుకు కదిలారు. మూడు జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిర్వహించిన ధర్నాల్లో వేలాదిగా పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు కార్యాలయం లోనికి కార్మికులు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. తమ గోడు విన్నవించుకుంటామని కోరినా అనుమతించలేదు. అంగన్‌వాడీ కార్మికులకు తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతున్నారు. ఇంటర్నెట్ సమస్యలున్న ప్రాంతాల్లోనూ ఫేస్ యాప్ పేరుతో ప్రభుత్వం వేధింపులకు పాల్పడటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా జీవో.1 అమలుతో ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారంలోకి రాక ముందు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఆ హామీలను అమలు చేయలేకపోయారని అంగన్‌వాడీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అమలు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

పాత పెన్షన్ విధానం కోసం ఉపాధ్యాయుల సంకల్ప దీక్ష

సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన సంకల్ప దీక్షకు విశేష మద్దతు లభించింది. జిల్లాలో ఉపాధ్యాయులతో పాటు, ఇతర శాఖల ఉద్యోగులు, ఎంఎల్‌సిలు, ప్రజా సంఘాల నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తమ మద్దతు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి వారంలోనే సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా వైయస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చిన విషయం విదితమే. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి మూడున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలపై ఉక్కుపాదం మోపుతోంది. పోలీసుల సహకారంతో ఉపాధ్యాయులను ముందస్తు అరెస్టులు చేస్తూ ఉద్యమాన్ని అణచి వేసే కుట్ర చేస్తోంది. ఉపాధ్యాయులు శాంతి యుతంగా తమ ఆందోళనలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయకుంటే ప్రజా మద్దతు కూడగట్టుకుని తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

కొనసాగుతున్న పేపరు మిల్లు కార్మికుల ఆందోళన

రాజమహేంద్రవరంలోని ఎపి పేపరు మిల్లులో 8 కార్మిక సంఘాలు ఐక్యంగా చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ ఆందోళనలకు వివిధ కార్మిక సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది. కరోనా వైరస్ విజృంభించిన విపత్కర పరిస్థితుల్లోనూ సంస్థను లాభాల బాటలో నడిపించేలక్ష్యంతో చేసిన కార్మికుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని అఖిల పక్ష పార్టీలు ఖండిస్తున్నాయి. యాజమాన్యం ఇప్పటికైనా కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని సూచిస్తున్నాయి.



చంద్రబాబు పర్యటన వివరాలను డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథరావుకు అందజేస్తున్న జ్యోతుల నవీన్

కలెక్టరేట్‌కు చంద్రబాబు పర్యటన వివరాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15,16,17 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా అందుకు సంబంధించిన పర్యటన వివరాలను, చంద్రబాబుకి రాకకు ఏర్పాట్లు చేసేందుకు అనుమతి కోరుతూ కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగానికి చెందిన డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథరావుకు వివరాలు రిప్రజెంటేషన్‌ను టీడీపీ కాకినాడ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ 5.5 లక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతిలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ 4,21,600, అన్నదానం విరాళాల ద్వారా రూ 72,630, కేశ ఖండన ద్వారా రూ 11,200 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికు లకు ఉదయం పులిహార ప్రసాదం, మధ్యాహ్నం సుమారు 10 వేల మందికి మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ అర్చకులు, ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్,ఆలయ సిబ్బంది కృష్ణ, మోహన్‌రావు, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు, గ్రామ స్తులు, అంజనీకుమార్ సేవలందించారన్నారు.



పాదగాయ క్షేత్రాన్ని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి శ్యాంసుందర్, పిఠాపురం జడ్జిలు

పాదగయలో హైకోర్ట్ న్యాయమూర్తి

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ శ్యాంసుందర్ కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, న్యాయ మూర్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో రాజరాజేశ్వరి సమేత కుక్కుటేశ్వర స్వామిని, దత్తాత్రేయ స్వామిని, పదవ శక్తిపీఠం పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పిఠాపురం జడ్జిలు వాసంతి, మాధవి, సుధారాణి ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో కళారూపాల ప్రదర్శన

ప్రజాశక్తి - తాళ్ళరేవు



పోలేకుర్రులో తప్పటగుళ్ళు కళాకారుల ప్రదర్శన

పోలేకుర్రు కోదండరామ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ప్రదర్శించిన పలు కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తప్పెటగుళ్ళు, మహిళల కోలాటం నత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా తాళ్లరేవు పోలేకుర్రు తదితర ప్రాంతాల నుంచి అప్పన్న ఎద్దులు ఊరేగింపు ఊరేగింపుగా పోలేకుర్రు తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది ప్రజలు అన్న ప్రసాదాలు స్వీకరిం చారు. కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, మాజీ ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, స్థానిక సర్పంచ్ వెంటపల్లి నూకరాజు పాల్గొన్నారు.

ఆదిత్యలో కార్పొరేట్ కనెక్ట్ -2023

ప్రజాశక్తి- గండేపల్లి



సదస్సులో మాట్లాడుతున్న కంపెనీల ప్రతినిధులు

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో కార్పొరేట్ కనెక్ట్ -2023 పేరిట వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి అధ్యక్షతన వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన మేనేజర్లలతో సదస్సు నిర్వహించారు. వివిధ కంపెనీ ప్రతినిధులు ఎక్స్‌పర్ట్స్ హెచ్‌ఆర్ వి.పొన్నుస్వామి, వాచ్.ఆర్. ఎక్స్పర్ట్ ,కొనే ఏలే వాటర్ ప్రై. లి. హెచ్‌ఆర్ టి.ఆరుముగం, ప్రొఫెషనల్ విప్రో ఇన్ఫ్రా స్ట్రక్చర్., డిజిఎం హెచ్.ఆర్., రాణి శక్తి . జి.బి. హెచ్.ఆర్ సన్మిన ఇస్సాక్ పట్టురాజా, ఎల్ అండ్ టి. హెచ్.ఆర్. పనియప్పన్, నోవా టెక్స్ ప్రై. లి., హెచ్‌ఆర్ ఇరుదయరాజ్. హెచ్.ఆర్. అపెక్స్ సిస్టవ్ భారతి తసన్, హెచ్.ఆర్. ఇంకార్ప్ టెక్నాలజీస్ అభినయ ఇలంగోవన్, క్లాసిక్ ఇండస్ట్రీస్, హెచ్.ఆర్ దినేష్, ఎక్స్పర్ట్., హెచ్.ఆర్. చార్లెస్ లెనిన్ మయూరి అరుణ్ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్., నాగరాజన్ సేల్స్ డైరెక్టర్ గిగిన్ టెక్., పాల్గొన్నారు. ఈ సదస్సులో డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ గ్రూప్ ఆఫ్ ఆదిత్య కళాశాలలలో ఉద్యోగ నియామకాలు అనేది నిరంతర ప్రక్రియ అని, దేశంలోని వివిధ కంపెనీలు ఆదిత్యని సందర్శించి విద్యార్థులను ఎంచుకొని ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నామన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో విద్యార్థులు ముఖాముఖి కార్యక్రమంలో ప్రస్తుత పారిశ్రామిక అవసరాలు విద్యార్థుల సమాయత్తం కావలసిన అంశాలు వాటిపై చర్చించారు. సదస్సులో ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13 నుంచి పెదబ్రహ్మాదేవం రైల్వే గేట్ మూసివేత

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్



మూతపడనున్న పీబీ దేవం రైలుగేటు

సామర్లకోట మండలం పెద బ్రహ్మాదేవం గ్రామంలోని రైల్వే గేట్లు ఈనెల 13వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మూసివేస్తున్నట్టు సామర్లకోట రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శంకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్‌ల మరమ్మతు పనుల కారణంగా మూడు రోజులపాటు రైలుగేట్‌ను మూసి ఉంచుతున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు గమనించి వారి రాక పోకలకు ప్రత్యామ్నాయని ఏర్పాటు చేసుకోవాలని, అంత రాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

సమాచార వ్యవస్థ గతినే మార్చిన రేడియో

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రపంచ సమాచార వ్యవస్థ గతినే మార్చిన ఘనత రేడియోదే అని కాకినాడ పిఠాపురం రాజాస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.తిరుపాణ్యం అన్నారు. ప్రపంచ రేడియో దినోత్సవ వేడుకలలో భాగంగా రేడియో అల 90.8 ఎఫ్.ఎం, కాకినాడ పిఠాపుర్ రాజాస్ ప్రభుత్వ కళాశాల జర్నలిజం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేడియోకు వేలాది రూపాలను ప్రేరేపించగల సజానాత్మక శక్తి ఉందన్నారు. రేడియోలో మానవగళం ఉంటుంది కనుక పుస్తకం కన్నా మెరుగయిన భావనాత్మక మాధ్యమంగా రేడియోను చెప్పవచ్చన్నారు. కాలాన్ని, దూరాన్ని జయించే ప్రసార సాధనం రేడియో అన్నారు. కార్యక్రమంలో రేడియో అల 90.8 స్టేషన్ డైరెక్టర్ ఎం.సత్య, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ దడాల శ్రీధర్, కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, వివిధ విభాగాల అధ్యాపకులు, జర్నలిజం విద్యార్థులు పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న కోరమండల్ మహిళా సభ్యులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడరూరల్

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ క్లబ్ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రతి నెల రెండో శనివారం ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్య్ర కమంలో రవిశంకర్ పట్నాయక్, లక్ష్మీ సజన, అంజుమ్, రేలంగి బాపిరాజు, అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

గాయపడ్డ యువకుని కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - కాజులూరు



శంకర్ తల్లికి అందిస్తున్న అయ్యప్ప

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కోలా శంకర్ కుటుంబానికి గొల్లపాలెం గ్రామానికి చెందిన ఆకులు అయ్యప్ప అతని మిత్రులు చేయూతనిచ్చారు.కోలా శంకర్ కాకినాడలో మోటార్ బైక్ షో రూమ్‌లో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. వారం రోజుల క్రితం కాకినాడ నుండి గొల్లపాలెం వస్తుండగా కొంగోడు వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోగా తలకు తీవ్ర గాయం అయింది. సమాచారం తెలుసుకున్న ఆకుల అయ్యప్ప తన మిత్రులకు సమాచారం అందించి సాయం చేయాలని కోరగా రూ.50 వేలు శంకర్ తల్లికి శనివారం అందజేశారు.

ఆందోళన చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవు

కానిస్టేబుల్ పరీక్షల అర్హత సాధించలేని విద్యార్థులకు ఎస్‌పి సూచన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష వ్రాసి అర్హత సాధించలేని అభ్యర్థులు 5 పర్సెంట్ కట్ ఆఫ్ మార్కులు కలపాలని తలపెట్టిన గౌరవ ఆంధ్రప్రదేశ్ సీఎం క్యాంప్ కార్యాలయ ముట్టడి, నిరసనలకు ఏ విధమైన అనుమతులు లేవని, అటువంటి కార్యక్రమాలు చేపట్టడం చట్ట వ్యతిరేకం దీనికి అనుగుణంగా క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని ఎస్‌పి ఎం రవీంద్రనాథ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా నుండి ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు గానీ, వారికి మద్దతు తెలిపే అర్హత సాధించిన అభ్యర్థులు గాని నిరసన కార్యక్రమాలలో పాల్గొని బంగారు భవిష్యత్‌ను ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు హితవు పలికారు. తల్లిదండ్రులు శిక్షణ ఇచ్చే సెంటర్ల నిర్వాహకులు దృష్టి పెట్టి అటువంటి కార్యక్రమాలను మానుకునే విధంగా అభ్యర్థులకు సూచించాలని ఎస్‌పి హితువు పలికారు. కాకినాడ జిల్లా నుండి తలపెట్టిన ఈ ముట్టడి కార్యక్రమానికి ఎట్టి పరిస్థితులలో ఎవరిని అనుమతించేది లేదని జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ అధికారులకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేసినట్టు ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు తెలిపారు.



పిల్లలకు వడ్డిస్తున్న దుర్గారావు

అనాథలకు అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక మార్చ్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు తల్లి సత్యవతి 6వ వర్ధంతి పురస్కరించుకుని అనాథ ఆశ్రమంలో పిల్లలకు శనివారం అన్నదానం నిర్వహించారు. తొలుత సత్యవతి చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన పుస్తకాలుతో పాటు స్వీట్స్ బిస్కెట్లు ఫ్రూటీలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ ఏ డి వి ప్రసాద్, కటకం కిరీటి, గొళ్ళ నాగేశ్వరరావు, పెచ్చేటి కష్ణ, కోరాడ రాజు, తూమురౌతు గురవయ్య ఉన్నారు.

పిఎంపి మృతికి సంతాపం

ప్రజాశక్తి-మండపేట

మండపేటలో పేదల వైద్యునిగా పేరుగాంచిన పిఎంపి ఉప్పలపాటి అచ్చిరాజు (72) శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. సైదులపేటలో గత 50 సంవత్సరాలుగా పేదలకు వైద్యసేవలు చేసి పేరు ప్రఖ్యాతలు గడించారు. ఆయన మృతికి పిఎంపిలు కె. సత్యనారాయణ, మారిశెట్టి సత్యనారాయణ, బళ్లా వెంకటరమణ, వానపల్లి కనకరాజు తదితరులు సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బెదిరింపుల కేసులో ఒకరు అరెస్ట్

మరొకరు పరారీ

ప్రజాశక్తి- మండపేట

బ్లాక్‌మెయిలింగ్ కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేయగా ఎ1 గాడు సత్యనారాయణను అదుపులోనికి తీసుకున్నట్లు టౌన్ సిఐ శివ గణేష్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన చింతల వీరప్రసాద్ తన ఇంటిపై మొదటి అంతస్తు నిర్మించుకుంటుంటే రౌడీషీటర్ సత్యనారాయణ, ఒక పత్రిక రిపోర్టర్ సయ్యద్ హుస్సేన్ ఫోటోలు తీసి డబ్బులు డిమాండ్ చేశారని తెలిపారు. నిందితులిద్దరూ కలిసి కొంతకాలంగా ఈ దందా సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 1000 వరకు ఆర్‌టిఐ ఫిర్యాదులు చేశారన్నారు. గాడు సత్యనారాయణపై 16 కేసులు, రౌడీషీట్ ఉందని తెలిపారు. త్వరలోనే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామన్నారు. సమాచార హక్కు చట్టం ఎంతో విలువైనదని, దీన్ని ఇలా బ్లాక్ మెయిలింగ్ కోసం కాక సమాజానికి మంచి చేసేందుకు మాత్రమే వినియోగించాలన్నారు. పరారీలో ఉన్న హుస్సేన్‌ను త్వరలోనే అదుపులోనికి తీసుకుని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. బాధితులు నిర్భయంగా 9440796537 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సిఐ సూచించారు. ఈ సమావేశంలో టౌన్ ఎస్ఐ ఎం.అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ